GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం


మెయిన్

సంపుటి : 7 | సంచిక : 295 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 26.04.2025 | పేజీలు : 3

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

### అమరావతి పున:ప్రారంభ పనులకు ఆహ్వానించిన సీఎం

**టీ మీడియా, ఏప్రిల్ 25, ఢిల్లీ బ్యూరో :**



దిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమ మద్దతు ఉంటుందని ప్రధానికి స్పష్టం చేశారు. మే 2వ తేదీన అమరావతి పునఃప్రారంభ పనులకు మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. లక్ష కోట్లకుపైగా వివిధ ప్రాజెక్టుల పనులకు మోదీతో శంకుస్థాపన చేయించేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వెలగపూడి సచివాలయం వెనుక వైపు 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అమరావతి పునఃప్రారంభ పనులకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 5 లక్షల మంది సభకు వస్తారని అంచనా వేస్తున్నారు. మోదీ రోడ్ షోలో దాదాపు 30 వేల మంది పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించారు. లక్ష కోట్ల పనుల ప్రారంభానికి సూచికగా ప్రధాని మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారు. అమరావతి, ఏపీకి సంబంధించిన వివిధ అంశాలు ప్రధానితో చంద్రబాబు చర్చించారు.

# మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను తొలగించాల్సిందే

## డిజైన్ ,నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు లోపాలు

## ప్రభుత్వానికి ఎన్‌డీఎస్‌ఏ నివేదిక



**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**

మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అన్ని స్థాయిల్లోనూ లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టం చేసింది. మేడిగడ్డ ఆనకట్టలోని ఏడో బ్లాక్‌ను సురక్షితంగా తొలగించడం లేదా స్థిరీకరణ చేయాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. బ్యారేజీలు దెబ్బ తిన్నందున అన్నారం, సుందిళ్ల నుంచి సైతం నీటి మళ్లింపు సురక్షితం కాదని స్పష్టం చేసింది. 3 ఆనకట్టలకు సంబంధించి అన్ని అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయాలన్న కమిటీ, భవిష్యత్తులో ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో, ఆ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం సూచించింది.

**ఆ సమస్యలపై అధ్యయనం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్‌లోని పియర్ కుంగిపోవడంతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లోనూ సమస్యలు తలెత్తడంతో సమగ్ర అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు ఉన్నతాధికారులతో సమీక్షించి, పలు దఫాలు సమావేశమై నివేదికను రూపొందించింది. రికార్డులు, డిజైన్లు అన్ని అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలించింది. నమూనాలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వివిధ పరీక్షల ఫలితాలను విశ్లేషించి తగిన సిఫారసులు చేసింది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పగుళ్లు ఏర్పడి పియర్స్ దెబ్బతినడం, కుంగడం, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లో సీపేజ్, ఇతర సమస్యలపై కమిటీ అధ్యయనం చేసింది.

**అసంపూ ర్ణ భూకంప పరీక్షలు**

ప్రాథమిక నివేదిక ఇచ్చిన కమిటీ 2024 వర్షాకాల సీజన్‌కు ముందు తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టాలని, సాంకేతిక పరీక్షలు చేయాలని సూచించింది. అయితే వాటిని పూర్తిగా, సమర్థవంతంగా అమలు చేయలేదని కమిటీ ఆక్షేపించింది. సాంకేతిక పరీక్షలు పూర్తి కాకముందే గ్రౌటింగ్ చేయడంతో నిర్దిష్ట కారణాల అంచనాకు ఆటంకం ఏర్పడిందని ఫాలో-అప్ డ్రిల్లింగ్ లేకపోవడంతో జీపీఆర్, ఈఆర్టీ, భూకంప పరీక్షలు అసంపూర్ణం అయ్యాయని వివరించింది.

**డిజైన్లు మార్చారు**

ఆనకట్టల డిజైన్ మొదలు నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అడుగడుగునా లోపాలు, ఉల్లంఘనలు ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డిజైన్, హైడ్రాలిక్ నమూనాలు, గేట్ ఆపరేషన్‌లు సరిగా లేవని ఎనర్జీ డిసిపియేషన్, గేట్ సీట్ పొజిషనింగ్‌లో డిజైన్ లోపాలు ఉన్నాయని పేర్కొంది. మోడల్ స్టడీస్ సరిగ్గా జరగలేదని, హైడ్రాలిక్ - స్ట్రక్చరల్ డిజైన్ సరిపోలేదని తెలిపింది. కేంద్ర జలసంఘం పరిశీలనలో డీపీఆర్ ఉండగానే బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైందని, ముందస్తు జియోటెక్నికల్ అధ్యయనాలు లేకుండా అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణ ప్రాంతాలు, డిజైన్లను మార్చారని పేర్కొంది. బ్యారేజీల నిర్మాణంలో నీటిపారుదల శాఖ ఉల్లంఘనలకు పాల్పడిందని తేల్చింది. ఆనకట్టల నిర్వహణ, మాన్యువల్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల మొదటి ఏడాదిలోనే సమస్యలు తలెత్తాయని




మరమ్మతులు సైతం వెంటనే చేపట్టలేదని నిపుణుల కమిటీ తెలిపింది. 2012 డ్యాం సేఫ్టీ చట్టాన్ని ఉల్లంఘించినట్లు స్పష్టం చేసింది. బ్యారేజీలో నిర్వహణ లోపాలు సమస్యలు తెచ్చిపెట్టాయని, డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని పాటించకపోవడంతో మరింత పెరిగాయని కమిటీ అభిప్రాయపడింది.మేడిగడ్డ బ్యారేజీలో పైపింగ్, నాణ్యత లేని సీకెంట్ పైల్ కటాఫ్‌ల కారణంగా ఏడో బ్లాక్ దెబ్బతినట్లు, అన్నారం, సుందిల్లలోనూ బలహీనమైన నిర్మాణం, సరిగ్గా లేని కటాఫ్ గోడల డిజైన్ వల్లే సమస్యలు తలెత్తినట్లు గుర్తించింది. సీకెంట్ పైల్ కటాఫ్స్‌లో నాణ్యత లేకపోవడమే పియర్ కుంగడానికి కారణమన్న కమిటీ నాణ్యతా లోపం వల్లే ఎగువ, దిగువన కటాఫ్ సిస్టంలో వైఫల్యం జరిగిందని స్పష్టం చేసింది. బలహీనమైన ఆర్‌సీసీ, పీసీసీ పైల్స్, రాఫ్ట్ కనెక్షన్, నాణ్యత లేని నిర్మాణం కారణంగా ఇబ్బందులు వచ్చినట్లు పేర్కొంది. డిజైన్, నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తాయని తెలిపింది. అన్ని బ్యారేజీలకు కటాఫ్ వాల్ అంశాలు ఆందోళనకరంగా ఉన్నాయని,

**భద్రత కోసం సమష్టి చర్యాలు**

బ్యారేజీల్లోనీ ఇతర బ్లాక్‌లలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మేడిగడ్డలోని అన్ని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలని తెలిపింది. మూడు ఆనకట్టల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం అవసరమన్న కమిటీ జియోటెక్నికల్, జియోఫిజికల్, హైడ్రాలిక్, స్ట్రక్చరల్ పరీక్షలు పక్కాగా చేయాలని పేర్కొంది. తక్షణ మరమ్మతులు చేపట్టాలని, మూడు బ్యారేజీలకు సమగ్ర పునర్నిర్మాణ డిజైన్ అవసరమని పేర్కొంది. దీర్ఘకాలిక భద్రత కోసం అన్ని విభాగాలు సమష్టిగా చర్యలు చేపట్టాలని నిపుణుల కమిటీ సూచించింది. మేడిగడ్డ ఆనకట్ట ఏడో బ్లాక్ పియర్స్‌కు పగుళ్లు, కుంగిన నేపథ్యంలో ఆ నిర్మాణాలను గేట్ల ఆపరేషన్ కోసం ఉపయోగించరాదని కమిటీ సిఫార్సు చేసింది. పక్క బ్లాకులు



దెబ్బతినకుండా ఏడో బ్లాకును తొలగించాలని లేదంటే స్థిరీకరించాలని తెలిపింది. దెబ్బతిన్న సీకెంట్ పైల్స్‌ను పునరుద్ధించడం లేదా గ్రౌటింగ్ చేయాలని సూచించింది. నాణ్యత కోసం డయాఫ్రమ్ వాల్ రకాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది.నీటిని మళ్లించడం సురక్షితం కాదు : రాఫ్ట్ కింద ఉన్న గోతులను పూడ్చాలని, ఈ క్రమంలో బ్యారేజీ ఫౌండేషన్ దెబ్బతినకుండా మళ్లీ స్ట్రక్చరల్ అనాలిసిస్ చేయాలని తెలిపింది. ఏడో బ్లాక్ కోసం కొత్త నిర్మాణం, డెక్ స్లాబ్, ఎనర్జీ డిసిపియేషన్ ఆరేంజ్‌మెంట్ ప్రత్యేకంగా విశ్లేషించాలని పేర్కొంది. అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు సైతం నష్టం జరిగినందున వాటి ద్వారా నీటిని మళ్లించడం సురక్షితం కాదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.భవిష్యత్తులో ప్రాజెక్టులకు సంబంధించి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం నిపుణుల కమిటీ నివేదికలో సూచించింది. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు, బ్యారేజీలు నిర్మించినప్పుడు జియో టెక్నికల్ పరీక్షలు సమగ్రంగా నిర్వహించాలని తెలిపింది. అన్ని కోణాల్లో, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నమూనా అధ్యయనాలు, విశ్లేషణలు పక్కాగా జరగాలని ఖచ్చితమైన సమాచారంతో ప్రక్రియ చేపట్టాలని సూచించింది. ప్రాజెక్టు డిజైన్లు, డేటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్స్‌లో సీడీవో పాత్ర లేదని తెలిసిందని, అది సరికాదని వెల్లడించింది.

**క్వాలిటీ కంట్రోల్ బలోపేతం**


నిర్మాణం జరుగుతున్నప్పుడూ సీడీవో యూనిట్ సహా అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని తెలిపింది. పనుల గడువులను దృష్టిలో ఉంచుకొని ఆమోదించిన నిర్మాణ విధానం విషయంలో ఎట్టి పరిస్థితులను రాజీ పడరాదని పేర్కొంది. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దన్న నిపుణుల కమిటీ క్వాలిటీ కంట్రోల్ విభాగం పూర్తి స్వతంత్రంగా ఉండాలి తప్ప ఒకరి కింద పని చేస్తున్న విధానం సరికాదని స్పష్టం చేసింది. క్వాలిటీ కంట్రోల్ విభాగానికి తగిన సిబ్బందిని ఇచ్చి బలోపేతం చేయాలని సూచించింది.ప్రాజెక్టు పనుల పురోగతి, నాణ్యత పరిశీలనకు థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ విధానం ఉండడం మంచిదని దాన్ని పరిశీలించాలని సూచించింది. ప్రతి ప్రాజెక్టుకు విధిగా నిర్వహణ మాన్యువల్స్ ఉండాలని వాటిని కచ్చితంగా పాటించేలా చూడాలని తెలిపింది. అన్ని రకాల మోడల్స్ చేసేలా ఇంజనీరింగ్ రీసెర్చ్ లాబరేటరీని బలోపేతం చేయాలని సిఫారసు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలు డ్యాం సేఫ్టీ చట్టం కింద ఉన్నందున అందులోని నిబంధనలు పూర్తిగా అమలు అయ్యేలా చూడాలని తెలిపింది. అన్ని ప్రాజెక్టులకు సంబంధించి నిర్వహణ, నిఘా, తనిఖీ తదితరాలన్నీ పక్కాగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సూచించింది.

## పేల్చేయడం తప్ప మరో మార్గం లేదు

### ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులపై నిపుణుల కమిటీ

### సహాయక చర్యలకు డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**



ఎస్ఎల్‌బీసీ సొరంగం డేంజర్ జోన్?లో సహాయక చర్యలు, భవిష్యత్ పనులకు డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం (డీబీఎం) తప్ప ఇంకో మార్గం లేదని నిపుణులు అభిప్రాయపడ్డారు. డేంజర్ జోన్?లో సహాయక చర్యలకు అనుసరించాల్సిన విధానానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తొలి సమావేశం గురువారం జరిగింది. హైదరాబాద్ జల సౌధలో జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.చివరి 50 మీటర్ల డేంజర్ జోన్?లో సహాయక చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఆ ప్రాంతంలో ఉన్న రాతి పొరలు, ఇతరత్రాల దృష్ట్యా మళ్లీ కుప్పకూలే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో సహాయక చర్యలు సహా భవిష్యత్ పనుల కోసం ఇన్?లెట్ ప్రాంతం నుంచి సంప్రదాయ డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం తప్ప ఇంకో మార్గం లేదని నిపుణులందరూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు పర్యావరణ నిబంధనలు పరిశీలించి సిఫారసు చేసేందుకు మరో ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు.ఇక నుంచి ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ కాకుండా ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి కాలరీస్, రైల్వే సిబ్బంది సహాయంతో రాళ్లు, వ్యర్థాల తొలగింపు చర్యలు కొనసాగించాలని నిర్ణయించారు. డేంజర్ జోన్?లో మిగిలిపోయిన ఆరుగురి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.25 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని నిపుణుల కమిటీ సిఫారసు చేసినట్లు సమాచారం.ప్రత్యామ్నాయాలపై దృష్టి : ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ సొరంగం (ఇన్‌లెట్) పైకప్పు కూలిన విషయం తెలిసిందే. ప్రమాదంలో 8 మంది చిక్కుకుపోగా, ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ఈ క్రమంలో సొరంగం నిర్మాణంతో పాటు భవిష్యత్ ప్రణాళికలు, రక్షణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. నిపుణుల కమిటీ తిరిగి ఒక సాంకేతిక ఉప కమిటీని ఏర్పాటు చేసింది. పలు జాతీయ సంస్థలతో పాటు కర్నల్ పరీక్షిత్ మెహ్రాకు ఇందులో స్థానం కల్పించారు. ప్రస్తుత ప్రమాదం నేపథ్యంలో తవ్వకాలకు ప్రత్యామ్నాయ చర్యలపై సూచనలు అందజేసే బాధ్యతను దీనికి అప్పగించారు.ఉపరితలం నుంచి సొరంగం చివరి ప్రాంతానికి ఒక షాఫ్ట్ (మార్గం) నిర్మించాలంటే అమ్రాబాద్ రక్షిత పులుల అభయారణ్యానికి సంబంధించి కేంద్రం అనుమతులు పొందాల్సి ఉంది. లేదా సొరంగం లోపల డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో తవ్వకాలు చేపట్టి ఇప్పుడున్న మార్గం నుంచే 14 కి.మీ. వెనక్కు మట్టి, రాళ్లను తరలించాలి. అయితే, దీనికి ముందు భూమి పొరల తీరును అంచనా వేయడానికి బోర్ రంధ్రాలు వేయాలన్న అభిప్రాయం ఉంది. దీనికి కూడా కేంద్రం అనుమతులు తప్పనిసరి. లేదంటే భూమి పొరల తీరును స్కానింగ్ చేసి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో వీటిలో ఏది మేలన్నదానిపై ఉప కమిటీ నివేదిక అందజేయనుంది.

## మోదీ సర్కార్ ఏం చేసినా మా మద్దతు

### పహల్గాం బాధితులకు రాహల్ పరామర్శ

### శ్రీనగర్‌లో పర్యటన బాధితులకు పరామర్శ

**టీ మీడియా, ఏప్రిల్ 25, శ్రీనగర్ :**

ఉగ్రవాదానికి భారతీయులందరూ ఐక్యంగా ఉండటం అవసరమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్ లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఉగ్రదాడి బాధితులను కలిసి



పరామర్శించి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.సమాజాన్ని విభజించడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని. ఈ ఉగ్రచర్యను జమ్మూ కశ్మీర్ మొత్తం ఖండించింది. వీరికి యావద్దేశం పూర్తి మద్దతుగా నిలిచింది. భారతీయులంతా ఐక్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. అప్పుడే ఉగ్ర చర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలం. కశ్మీర్‌తోపాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరం. మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి. లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితోనూ భేటీ అయ్యా. ఏం జరిగిందో వారు వివరించారు. మా పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీ ఇచ్చా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.భారత ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా భేటీ అయ్యారు. సరిహద్దులో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఆయనకు వివరించినట్లు సమాచారం. శ్రీనగర్, ఉదంపుర్‌లో పర్యటించిన ఆర్మీ చీఫ్, కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ సైన్యం తూట్లు పొడుస్తున్న వేళ ఈ వరుస సమీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.మరోవైపు, పహల్గాంలో పాశవిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులు భారత్‌ను మరింత రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. పాకిస్థాన్‌కు చెందిన హ్యాకింగ్ బృందం ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. రెండు దేశాల సిద్ధాంతంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన హ్యాకర్లు, హోం పేజీలో ఓ ఇమేజ్‌ను పోస్టు చేశారు. దీనిని ఆర్మీ వర్గాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. అయితే, ఇప్పటికే దీన్ని పరిష్కరించే ఒదుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం.

## ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2025

**రెండు రోజుల పాటు సదస్సు**

**వంద దేశాల నుంచి ప్రతినిధులు రాక**

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**




పెట్టుబడ లు, న్యాయం, ప్రపంచ శాంతి, అహింస అనే మహత్తర లక్ష్యాలతో ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ - 2025 నేడు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), నోవాటెల్‌లో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అపూర్వ స్వాగతం లభించింది.కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సాంప్రదాయబద్ధమైన బోనాలు, డప్పు చప్పుళ్లతో

మిగతా 3లో..

## కస్తూరి రంగన్ సేవలు చిరస్మరణీయం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**



ఇస్రో మాజీ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో చైర్మన్‌గా, ముఖ్యంగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో

మిగతా 3లో..

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు దక్కుతాయా

- లబ్ధిదారుల్లో అయోమయం
- అర్హత లేని వారు కమిటీ సభ్యులు
- పార్టీ జెండా మోసిన వారిని పక్కకు



**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో పేదల కోసం నిరాశ్రయుల కోసం అని ఘనంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇప్పుడు ఎవరి చేతుల్లోకి వెళుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలు చర్చించు కుంటున్నారు. కమిషన్లు, బంధుప్రీతి, నాయకుల సొంత వర్గాల ఆధిపత్యం ఇవే ఇప్పుడు ఇందిరమ్మ గృహాల కథను తీర్చిదిద్దుతున్నాయి. ఇందిరమ్మ గృహాల పథకం ఉద్దేశం ప్రకారం గుడిసెల్లో, గుండెలు బద్దలైన కలలతో బతుకుతున్న పేదలకు ఒక ఆశ్రయం కల్పించడం. కానీ వనపర్తి జిల్లాల్లోని గ్రామాలు, మండలాల్లో, మున్సిపాలిటీ లలో ఈ పథకం దారి తప్పే పరిస్థితి కనిపిస్తుంది. ఎన్నో సంవత్సరాలుగా హస్తం జెండా మోసిన వారు, పెద్ద భవంతుల్లో నివసించే సంపన్నులు, కమిషన్లు ఇచ్చే డబ్బున్న వాళ్లు వీళ్లే ఇప్పుడు ఈ ఇళ్లను కొట్టేస్తారేమో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మా ఎమ్మెల్యే మా పార్టీ-మా ఇష్టం, మా కమిటీ-మా ఇష్టం అన్నట్టుగా ఇష్టారాజ్యంగా ఈ ఇళ్లను అందజేస్తారేమోనని లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. కాంగ్రెస్ జెండా పట్టని వారు కమిటీ సభ్యులుగా చలామణి అవుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఒక వార్డులో కౌన్సిలర్ ఇంట్లో పని చేసే మహిళా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పనిచేసే మహిళా, పార్టీలో పని చేయని వారు కమిటీ సభ్యుల అని ప్రజలు అవ్వకవుతున్నారు. చదువుకున్న వారు కాంగ్రెస్ లో పని చేసిన వారు కాదని కౌన్సిలర్ కు నచ్చిన, మెచ్చిన వారిని కమిటీ సభ్యులుగా నియమించారు కాలనీ ప్రజలు నవ్వుతున్నారు . రాజుల సొమ్ము రాళ్లపాలైనట్టు, పేదల గూడు గద్దల చేతుల్లోకి వెళుతోంది. మేం పదేళ్లు కష్టపడ్డాం, కేసుల్లో ఇరుక్కున్నాం, జైళ్లకు వెళ్లాం. ఇప్పుడైనా మా పార్టీ అధికారంలోకి వచ్చింది కదా, ఎందుకు మేం ఇల్లు తీసుకోకూడదు ఇది కాంగ్రెస్ కార్యకర్తల తీరు. కొందరేమో ఎమ్మెల్యేని గెలిపించుకున్నాం . ఎమ్మెల్యే వెంటే ఉన్నాం మాకే ఇల్లు కావాలని కొందరు మండల నాయకుల నుంచి జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకుల వరకూ ఈ హవా స్పష్టంగా కనిపిస్తోంది. నీవు పైసల్ ఇస్తే నీకు ఇల్లు కేటాయిస్తాం అన్నట్టుగా బజారున చర్చలు జోరుగా సాగుతున్నాయి. బంధుప్రీతి, కమిషన్ల ఆటలు, సొంత వర్గాలకు ప్రాధాన్యం ఇవే ఇప్పుడు ఇందిరమ్మ గృహాల కేటాయింపును శాసిస్తున్నాయి. నిజాయితీగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, పేద ప్రజలు ఈ దౌర్జన్యాన్ని చూసి నిరాశలో మునిగిపోతున్నారు. మేం మేఘాన్నను నమ్మి, కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేశాం. అధికారంలోకి తెచ్చాం. కానీ, ఇప్పుడు మా గూడు కోసం చేస్తున్నారు. ఇందిరమ్మ గృహాలు పేదల కోసం కాదా? కానీ, ఈ ఇళ్లు ఎవరికి దక్కుతున్నాయి? మొన్నటి దాకా బీఆర్ఎస్ లో ఉన్న నాయకులు కూడా ఇప్పుడు కాంగ్రెస్ గూటికి చేరి ఈ ఇళ్లను కొట్టేస్తున్నారు. ఇది ఎక్కడి న్యాయం? నిజంగా గుడిసెల్లో బతుకుతున్నవారు, కూటికి లేని కటిక పేదలు ఈ జాబితాలో ఎక్కడున్నారు? గ్రామాల్లో, మండలాల్లో, జిల్లాల్లో ఈ అన్యాయం గురించి మాట్లాడే వారు కొందరు ఉన్నా, వాళ్లను నోరు మూయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిజాయితీగా కాంగ్రెస్ కోసం కష్టపడిన కార్యకర్తలు సైతం ఈ పరిస్థితిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆలోచించాలి. మేం మీకు నమ్మకంగా ఓటేశాం. పేదల కోసం అన్న ఈ ఇళ్లు, డబ్బున్నవాళ్లకు, సంపన్నులకు కేటాయిస్తే ఎలా? మీరు పేదల గుండెల్లో స్థానం సంపాదించారు. మీ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మీ చేతుల్లోనే పేదల కలలను నిజం చేసే బాధ్యత ఉంది. ఇందిరమ్మ గృహాలు నిజంగా గుడిసెల్లో బతుకుతున్నవారికి, కూటికి లేని పేదలకు చేరేలా చూడండి. సంపన్నులకు, డబ్బున్న వారికి, కమిషన్లు ఇచ్చే వారికి కాకుండా, నిజమైన అర్హులకు ఈ ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోండి. ఇందిరమ్మ గృహాలు నిజంగా పేదల గూడుగా మారాలి. అప్పుడే అసలైన ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలన అవుతుంది.

# రాయనపాడు రైల్వేస్టేషన్ ఆధునీకరణ

- రూ.12.13 కోట్లతో అభివృద్ధి
- 58 శాతం పనులు పూర్తి



**టీ మీడియా, ఏప్రిల్ 25, ఇబ్రహీంపట్నం :**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ అబివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని ఈ రైల్వేస్టేషన్ 1899లో ప్రారంభమైంది. దీనిని 1980-81 మధ్య కాలంలో పూర్తి స్థాయిలో విద్యుద్దీకరించారు. అప్పటి నుండి ప్రయాణికులకు విస్తృత సేవలందిస్తోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53 రైల్వేస్టేషన్లను రూ.20,061 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా రాయనపాడు రైల్వే స్టేషన్లో రూ.12.13 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విజయవాడ రైల్వేస్టేషన్‌కు శాటిలైట్ స్టేషన్లుగా రాయనపాడు, మధురా నగర్, గుణదల, రామవరప్పాడు, కృష్ణా కెనాల్ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు గతంలో నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ బైపాస్ స్టేషన్‌గా రాయనపాడు స్టేషన్‌కు పేరుంది. దీంతో, విజయవాడకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్టేషన్లో మొత్తం 22 రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టనున్నారు. స్టేషన్ ఆధునీకరణలు భాగంగా మూడు ప్లాట్ ఫారాలతో ఎన్ఎస్‌జి 5 కేటగిరి రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ (రైళ్ల రాకపోకలు)ని మెరుగుపర్చడం, స్టేషన్‌ను సుందరీకరించడం, ప్రదేశ ద్వారం వద్ద వరండా ఏర్పాటు, వికలాంగులకు అనుకూలమైన టాయిలెట్ల ఏర్పాటు, స్టేషన్ భవనంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఎసి వెయిటింగ్ హాలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు, ప్లాట్ ఫారాలను మెరుగుపర్చడం, షెల్టర్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే సంప్రదాయ కొండపల్లి బొమ్మలతో కూడిన ఛాయాచిత్రాలతో స్టేషన్‌కు అద్భుతంగా తీర్చిదిద్దారు. కవర్ ఓవర్ (సిఒపి) నిర్మాణంతో సహా ఒక ప్లాట్ ఫారాన్ని పూర్తి స్థాయిలో ఇప్పటికే అభివృద్ధి చేశారు. షెల్టర్లు, ప్లాట్ ఫామ్ ఉపరితలం, వెయిటింగ్ హాలు, మాడ్యులర్ టాయిలెట్ ముఖ భాగం, సర్కులేటింగ్ ఏరియా, లిఫ్ట్ ఏర్పాటు తదితర పనులు 58 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**స్టేషన్ మాస్టర్, లోకో పైలెట్లు, గార్డులకు క్యాబిన్లు లేక ఇక్కట్లు**

అభివృద్ధి పనులు ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. స్టేషన్ మాస్టర్ క్యాబిన్, లోకో పైలట్, గార్డులకు గదులు కేటాయించలేదు. దీంతో, విధుల నిర్వహణలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారి విధుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారులు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పనులు పూర్తయ్యే క్రమంలో స్టేషన్ మాస్టర్ క్యాబిన్, లోకో పైలట్, ఇతర సిబ్బందికి ప్రత్యేక క్యాబిన్లు నూతనంగా నిర్మిస్తారా? లేక పాత క్యాబిన్లలో ఏర్పాట్లు చేస్తారా? అనేది రైల్వే అధికారులు స్పష్టం చేయడం లేదు. నిత్యం ప్రజలకు సేవలందించే తమకు సరైన వసతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.


**మే 2న ప్రారంభోత్సవం?**

2017-18, 2022-23 లలో భారతీయ రైల్వేస్టేషన్ల పునర్విభజన ఆధారంగా ఆదాయం, బాహ్య ప్రయాణికుల నిర్వహణపరంగా రాయనపాడును నాన్ సబర్బన్ గ్రేడ్ (ఎన్ఎస్‌జీ)-6 రైల్వేస్టేషన్‌గా గుర్తించారు. సుమారు కోటి రూపాయలు ఆదాయం గడిస్తూ ఒక మిలియన్ ప్రయాణికులకు సేవలందిస్తోంది. మే 2న రాజధాని అమరావతి పున:ర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ రాయనపాడు రైల్వేస్టేషన్‌ను కూడా ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

## కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌ను ఆపేయండి

- మావోయిస్టుల సంచలన లేఖ

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**



గత కొన్ని రోజులుగా మావోయిస్టులను అంత మొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భారత్‌ను మావోయిస్టు రహితంగా దేశంగా మారుస్తామని పలు సందర్భాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా అన్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు సుప్రీం కమాండర్ హిడ్మాతో పాటు భారీగా మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఇందులో భాగంగా ములుగు జిల్లాలోని కర్రెగుట్టల్లో ఉన్న మావోయిస్టులను ఏరిపారేసేందుకు ఆపరేషన్ "కగార్"ను చేపట్టాయి. ఈ ప్రాంతంలో గత మూడు రోజులుగా ఆపరేషన్ కగార్ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో భద్రత బలగాల ఆపరేషన్‌తో బెదిరిపోయిన మావోయిస్టులు.. కర్రెగుట్టల వద్ద జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మావోయిస్టు బస్తర్ ఇన్‌ఛార్జ్ రూపేష్ పేరుతో లేఖను విడుదల చేశారు. శాంతి చర్చలకు ముందుకు రావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని. ఒక నెల సైనిక చర్య వాయిదా వేసి చర్చలకు జరపాలని మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో రాసుకొచ్చారు. అయితే కర్రెగుట్టలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని శాంతి చర్చలకు ముందుకు రావాలన్న మావోయిస్టుల లేఖపై అటు పోలీసులు కానీ.. భద్రతా బలగాలు కానీ ఇంకా స్పందించలేదు. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాంతి చర్చలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ములుగు జిల్లాలోని కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ కొనసాగుతూనే ఉంది.

## అధికార లాంఛనాలతో చంద్రమౌళి అంత్యక్రియలు

**టీ మీడియా, ఏప్రిల్ 25, విశాఖ:**



కశ్మీర్ లోని పహెల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒకరు విశాఖకు చెందిన చంద్రమౌళి. పార్థివదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృత దేహాన్ని అంత్యక్రియలు నిర్వహించేందుకు తీసుకెళ్తుండగా ఆయన కుమార్తె తీవ్రంగా రోధించింది. బంధువులు, స్నేహితులు కన్నీరు పెట్టుకున్నారు. చంద్ర మౌళి అంతిమయాత్రలో విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. చంద్రమౌళి పార్థివ దేహానికి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసీపీ నేతలు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చంద్రమౌళి మృతితో విశాఖలో తీవ్ర విషాదం నెలకొంది. చంద్రమౌళి స్నేహితులు ఆయన లేడనే వార్తను జీర్ణించుకోలేక పోతున్నారు. కాశ్మీర్ పర్యటనను ఈరోజుతో ముగించుకొని.. అంటే ఏప్రిల్ 25వ తేదీన ముగించుకుని సేఫ్‌గా తిరిగి వస్తాడనుకుంటే.. ఈ రోజు ఇలా జరగడం చాలా బాధగా ఉందని బంధువులు, స్నేహితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి మాజీ ఎంపీపీ విరాళం


**టీ మీడియా ,ఏప్రిల్ 25 ,ఆత్మకూరు :**



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నంచర్ల గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి పిన్నంచర్ల గ్రామ పెద్దలు. మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు మూడు లక్షల రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో బసయ్య శెట్టి. శ్రీనివాస్ శెట్టి.నరేష్ శెట్టి.బంగారు భాస్కర్. శివానందరెడ్డి. మాజీ సర్పంచ్ వెంకటేష్. మాసన్న. శ్రీనివాస్ రెడ్డి. మనోహర్ గౌడ్,కురువ నరసింహ. తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన గుడి మన ఆలయం నిర్మాణానికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ధన వస్తు రూపేనా సహాయ సహకారం అందించి ఆలయ పునర్నిర్మాణంలో భాగం పంచుకోవాలని కోరారు.

## ఉగ్ర దాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ కోవత్తుల తో ర్యాలీ


**టీ మీడియా, ఏప్రిల్ 25, ఆత్మకూరు :**



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గామ్ లో దాడిని తీవ్రంగా ఖండిస్తూ,ఉగ్ర దాడిలో మృతి చెందిన ప్రతిఒక్కరికి నివాళి అర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఇండియా - జిందాబాద ..పాకిస్తాన్ - ముర్దా బాద్ అంటూ నినాదాలు చేసి ర్యాలీ తీసి ఘటనలో మరణించిన వారందరికీ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్ గౌడ్, టౌన్ పార్టీ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, సీనియర్ నాయకులు రహమతుల్లా, షబ్బీర్ ఎస్టిడి శీను, నాగేష్ దామోదర్, శివ, సాయి రాఘవ, గాలి పంపు శీను తదితరులు పాల్గొన్నారు.

# బ్రాండెడ్ సరుకు అని కుమ్మేస్తున్నారా.?

- కల్తీ మద్యంరెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నఎక్సైజ్ పోలీసు




**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**

ఆహారం, ఇతర నిత్యావసర వస్తువల్లో కల్తీని చూస్తున్న ప్రజలకు, చివరకు మద్యం కూడా కల్తీ అవుతుందని విషయం తెలుసుకుని షాక్‌కు గురవుతున్నారు. హైదరాబాద్ లింగంపల్లి ప్రాంతంలో ఒక బార్‌లో అక్రమంగా మద్యాన్ని కల్తీ చేస్తూ అడ్డంగా బుక్ అయ్యారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన చాలా రోజుల నుండి జరుగుతున్న ఎక్సైజ్ పోలీసుల దాడితో వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఉన్న ట్రూప్స్ బార్ లైసెన్స్ పునరుద్ధరణ జరగలేదు. అంతేకాకుండా, బార్ యజమానులు బకాయి ఉన్న ఫీజును కూడా చెల్లించలేదు. రంగారెడ్డి ఎక్సైజ్ సూపరిండెంట్ జీవన్ కిరణ్ అధ్యర్యంలో అబ్కారీ సిబ్బంది బార్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో బార్‌లో ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్స్‌ను తొలగించి, వాటిలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలుపుతూ ఉండగా అధికారులు పట్టుకునర్నారు. ఇందుకు సంబంధించి కూకట్‌పల్లికి చెందిన సత్యనారాయణ, పునిక్ పట్నాయక్ అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. రూ. 2,690 ధర కలిగిన జెమ్‌సన్ బ్రాండీ బాటిల్‌లో రూ. 1,000 ధర కలిగిన ఓక్స్‌మిత్ బ్రాండీని కలుపుతూ ఉండగా దొరికిపోయారు. తనిఖీలు నిర్వహించిన అబ్కారీ అధికారులు బార్‌లో కల్తీ చేయడానికి సిద్ధంగా ఉంచిన తక్కువ ధర కలిగిన మరో 75 బాటిళ్ల మద్యాన్ని, 55 ఖాళీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో గత కొంతకాలంగా ట్రూప్స్ బార్ యజమానులు లైసెన్స్ ఫీజు చెల్లించలేదని, అలాగే మద్యం డిపోల నుండి నేరుగా మద్యం తీసుకోవడం లేదని తేలింది. ఇతర మద్యం దుకాణాల నుండి తక్కువ ధరలకు మద్యం కొనుగోలు చేసి, అధిక ధర కలిగిన బాటిళ్లలో నింపి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విచారణలో వెల్లడైంది. మొత్తం 1.48 లక్షల విలువైన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బార్ లైసెన్స్ యజమాని ఉదయ్ కుమార్ రెడ్డి, మేనేజర్ వి. సత్యనారాయణ రెడ్డి, బార్‌లో పనిచేస్తున్న ఉద్యోగి పునిత్ పట్నాయక్‌లపై కేసు నమోదు చేశారు. నిందితులను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్. ఈ కల్తీ మద్యం వ్యవహారాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంలో ఏఈఎస్ జీవన్ కిరణ్ బృందం ఛేదించింది. మిక్సింగ్ మద్యం బాటిళ్ల కేసును సమర్థవంతంగా ఛేదించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘటన మద్యం విక్రయాలలో జరుగుతున్న అక్రమాలను వెలికితీసి, కఠిన చర్యలు తీసుకోవడానికి ఎక్సైజ్ శాఖ చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనంగా నిలుస్తోంది.



## భూ భారతితో భూములకు రక్షణ

- ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 25, దేవరకద్ర :**

దేవరకద్ర మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ మరియు రెవెన్యూ అధికారులతో కలిసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం భూభారతి చట్టమని అన్నారు, ఇకపై గ్రామాల్లో భూ పంచాయితీలు, వివాదాలు ఉండవని అన్నారు. భూములకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో భూ భారతి చట్టం, పోర్టల్ తెచ్చామని, భూ భారతిపై ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రైతులను మోసం చేయడానికే గత బీఆర్ఎస్ సర్కార్ ధరణి పోర్టల్ తెచ్చిందని, పేదలకు ఇచ్చిన భూములను సైతం ధరణి పేరుతో కొల్లగొట్టిందని ఆరోపించారు. ధరణి పేరుతో రైతులను, సామాన్యులను కోర్టుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేదాకా తిప్పిందని, 20 లక్షల ఎకరాలను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సాదా బైనామాలతో పాటు ఇతర ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని తెలిపారు. పేర్లు, సర్వే నంబర్లు, ఎకరాలు తప్పు పడినా గతంలో కార్యాలయాలు చుట్టూ తిరిగిన పనులు కాలేదని, ఆ సమస్యలు ప్రస్తుత చట్టం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ఒక్క రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా %వీ=ఉ%, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. మే 1 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. భూభారతి కింద భూముల వివరాలను డిజిటలైజేషన్ చేస్తామని, దీంతో భవిష్యత్‌లో రైతులకు భూ సమస్యలు, వివాదాలు రావన్నారు. ఈ పోర్టల్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని కోరారు. రెవెన్యూ చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిందని అన్నారు. జూన్ మొదటివారం నుంచి త్వరలో రెవిన్యూ వ్యవస్థలో ప్రతీ గ్రామంలో మునుపటిలాగా గ్రామ పాలన అధికారి (జీపీఓ) ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. భూ సమస్యలపై గతంలో లాగా గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి విచారణ జరిపి అక్కడే అధికారులు భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

## ఆరోగ్యమే బాగాలేదు.. రిటైర్ అయి మళ్లీ ఎందుకు ఆ పోస్టు

- ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్ విచారణలో వాడీవేడి వాదనలు!

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టులో వాడీవేడిగా వాదనలు సాగాయి. ప్రభాకర్ రావ్ తరపున న్యాయవాది సురేందర్ రావ్ వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావును నిందితుడిగా చేర్చక ముందే ఆయనపై ఎల్ ఓ సి జారీ చేశారని కోర్టుకు వివరించారు. 2023 డిసెంబర్ 4న సాయంత్రం 4 గంటలకు ప్రభాకర్ రావు తన చీఫ్ పోస్ట్ కు రాజీనామా చేశారని, ఆయన రిజైన్ చేసిన తరువాత ఆదేశాలను స్టాఫ్ ఎలా పాటిస్తారని ప్రశ్నించారు. 2023 డిసెంబర్ 2న రివ్యూ కమిటీ ఇచ్చిన ఆదేశాల ప్రకారమే ట్యాపింగ్ చేసిన ఆధారాలను ధ్వంసం చేశారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రివ్యూ కమిటీ భేటీ అయి ట్యాపింగ్ డీటెయిల్స్ నిర్వీర్యం చేసేలా ఆదేశాలిస్తుందని కోర్టుకు వివరించారు సురేందర్ రావు. హైకోర్ట్ జడ్జిల ఫోన్లు ట్యాప్ చేశారనేది పూర్తిగా అవాస్తవమని వాదనలు వినిపించారు. తన క్లైయింట్ ప్రభాకర్ రావు రాష్ట్రానికి ఎంతో సేవ చేశారని, ఎన్నో మెడల్స్ సంపాదించారని చెప్పారు. ఇప్పుడు ప్రభాకర్ రావు వయసు 64 ఏళ్లని, ఈ వయసులో ఆయనకు ఇలాంటి ట్రీట్మెంట్ ఇస్తారా? అని అడిగారు. ప్రభుత్వం తరపున సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ.. ఎన్ని మెడల్స్ వచ్చినా అధికార దుర్వినియోగానికి పాల్పడితే శిక్షకు అర్హులే అన్నారు. ఒకవేళ ప్రభాకర్ రావుకు ఆరోగ్యం బాగా లేకుంటే, క్యాన్సర్ పేషెంట్ అయితే రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా మళ్లీ ఎందుకు %బా×దీ% పోస్టులో రీ జాయిన్ అయ్యాడని ప్రశ్నించారు. చేసిన తప్పులకు ఆరోగ్యాన్ని అడ్డం పెట్టుకుని తప్పించుకోవాలని చూస్తున్నారని కోర్టుకు వివరించారు. ఆరోగ్యం సహకరించుకుంటే నేరుగా అమెరికాకి వెళ్లకుండా తిరుపతి, చెన్నై మీదుగా అమెరికాకు వెళ్లాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది హైకోర్టు.

## సత్యదేవుని హుండీల ఆదాయం 1.26 కోట్లు

**టీ మీడియా, ఏప్రిల్ 25, శంఖవరం (కాకినాడ) :**



అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి హుండీల కానుకలు లెక్కింపు ద్వారా 1,26,,07,501 రూపాయలు ఆదాయం లభించింది. శుక్రవారం కొండపైన ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐ వి రోహిత్ ల సమక్షంలో అధికారులు 28 రోజుల్లో వచ్చిన వివిధ గుండెలలో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటుగా 60.100 యం.ఎల్ గ్రాములు బంగారం, 950 గ్రాముల వెండి ఇంకా వివిధ దేశాల చెందిన కరెన్సీ లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పర్యవేక్షణ అధికారులు ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ అధికారులు ఇంచార్జి పి ఆర్ ఓ కొండలరావు పాల్గొన్నారు.

## పచ్చని పహల్గాం లోయలో మరణించిన అమరవీరులకు నివాళులు

- దేశం మొత్తం ముక్తకంఠంతో ఈ దుశ్చర్యను ఖండిస్తోంది
- వనపర్తి పౌర సంబంధాల అధికారి.సీతారాం

**టీ మీడియా, ఏప్రిల్ 28, వనపర్తి బ్యూరో :**




పచ్చని ప్రకృతి రమనీయతతో పర్యాటకులను ఆకర్షిస్తున్న పహల్గాంలో జరిగిన దాడితో భయానక పరిస్థితులు నెలకొనే లా చేసిన ఉగ్రవాదాన్ని రూపుమాపాలని వనపర్తి ప్రజా సంబంధాల అధికారి సీతారాం తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఉగ్రదాడికి నిరసనగా, అందులో మరణించిన అమరవీరులకు శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శనతో వనపర్తి వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ సీతారాం మాట్లాడుతూ భారతదేశంలో అన్ని మతాలు, కులాల ప్రజలు ఐక్యమత్యంతో జీవిస్తున్నారని, ఒకరి కష్ట సుఖాల్లో ఒకరు పాలుపంచుకుంటున్నారని తెలిపారు. భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్ ను అభివృద్ధి చేస్తోందని, కొన్నేళ్లుగా పర్యాటకరంగం ఊపందుకుందని అన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన పర్యాటకులు పహల్గాం కు వెళ్తూ స్వేచ్ఛగా ప్రకృతిని ఆస్వాదిస్తున్నారని అన్నారు. కానీ ఇది ఓర్వలేని వారు ఉగ్రవాదులను ప్రేరేపించి పచ్చని కాశ్మీర్ లో అలజడి సృష్టించేందుకు దాడి చేయించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు ప్రతీ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఎలా కట్టడి చేయాలో ప్రత్యేక ప్రణాళిక రచించాలని కోరారు. ఇండస్ వాటర్ ట్రీటీని వెనువెంటనే నిలుపుదల చేయడంతోపాటు క్రాస్ బార్డర్ టెర్రరిజాన్ని నిర్మూలించేందుకు సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని అన్నారు. భారతదేశం శాంతిని కోరుకుంటుందని అలా అని మన పౌరులపై దాడి చేసి చంపేస్తే ప్రతిఘటన కూడా తీవ్రంగా ఉండాలన్నారు. సీనియర్ జర్నలిస్టు కొండన్న మాట్లాడుతూ భారతదేశంలో ఎప్పుడు ఉగ్రదాడి జరిగినా దాయది పాకిస్థాన్ హస్తం ఉందని తేటతెల్లమైందని అన్నారు. ఉగ్రవాదాన్ని తరాలుగా పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఇప్పటికే ఆ దేశం ఆర్థికంగా చితికిపోయినా దేశాభివృద్ధిని వదిలేసి కేవలం ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సంబంధాల శాఖ అధికారి.(డిపీఆర్ఓ)సీతారాం నాయక్, వర్కింగ్ సీనియర్ జర్నలిస్టులు. నోముల రవీందర్ రెడ్డి, బోలెమోని రమేష్, కొండన్న యాదవ్, జానీ,బొడ్డుపల్లి లక్ష్మణ్,పికిలి రాము, ఖలీల్, జర్నలిస్టులు గోపాల్,దినేష్,శ్యామ్, శ్రీనాథ్,మల్లి ఖార్జున్, తిరుపతి, బంకల రవి, పురుషోత్తం, గోపాల్, అనిల్, గట్టు శేఖర్,బొడ్డుపల్లి రాజు, అరుణ్ రాజ్, మదనాపురం రవి, గోపాల కృష్ణ,రాములు, టీ మీడియా బ్యూరో గంధం రవికుమార్ ,ఫోటో గ్రాఫర్స్. యూసఫ్, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కునుకు లేకుండా చేస్తున్న బూడిద నీరు

- పగులుతున్న ఎన్టీపీసీ పైప్‌లైన్

**టీ మీడియా, ఏప్రిల్ 25,రామగుండం :**



రామగుండంలోని ఎన్టీపీసీ బూడిద(యాష్) పైపులైన్ తరచుగా పగులుతుండటం వల్ల ఆందోళనకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సమీప ఇళ్లలోకి బూడిదనీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ సమీపంలోంచే వెళ్తుండటం వల్ల అక్బర్‌నగర్, కుందనపల్లి వాసులు ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందోనని భయపడుతూ జీవిస్తున్నారు. ఎన్టీపీసీ నుంచి పైపులైన్ ద్వారా యాష్?ను కుందనపల్లి చెరువులోకి తరలిస్తారు. పైపులు అక్బర్‌నగర్‌కాలనీకి సమీపంలోనే ఉన్నాయి. గతంలో పలుమార్లు పైపులు పగిలి బూడిద నీరు ఇళ్లలోకి చేరింది. ఎన్టీపీసీ సంబంధిత అధికారులు ప్రతీసారి ఏదో కారణం చెప్పి తప్పించుకుంటున్నారు. కానీ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం చూపటం లేదు. పైపులైన్ చాలా ఏళ్లక్రితం ఏర్పాటు చేయడంతో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**పాడైన వస్తువులు**

ఇటీవల బూడిదనీరు ఇళ్లలోకి చేరటం వల్ల వస్తువులు పనికి రాకుండా పోయాయి. నిత్యావసరాలతో పాటు ఇంట్లోని వస్తువులు నీటితో నిండిపోయాయి. ఆహార పదార్థాలతో పాటు దుస్తులు మునిగిపోయాయి. చాలా ఇండ్లలోకి నీరు చేరటంతో రాత్రంతా నిద్రించే పరిస్థితి అనేది లేకుండా పోయింది. ప్రతీసారి కాలనీవాసులు బూడిద నీటితో తీవ్రంగా నష్టపోతున్నారు. బూడిద చెరువు పక్కనే ఉండటంతో పాటు పైపులైన్లు కాలనీ నుంచే వెళ్లటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే విషయం తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రమాదపు అంచున జీవిస్తున్న అక్బర్‌నగర్ వాసులకు మరోసారి ఇలాంటి ఘటనే పునరావృతం కావటంతో ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి వేళ ఇలాంటి ఘటన జరిగి ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని వారు వాపోయారు. పైపులైన్ నుంచి రక్షణ కల్పించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే ప్రమాద బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుంది. గతంలోనూ ఇదే విషయాన్ని కాలనీవాసులు విన్నవించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

**పునరావాసం కల్పించాలి**

'ఎన్టీపీసీ కాలనీవాసులకు పునరావాసాన్ని కల్పించాలి. నష్టపోయినటువంటి వస్తువులకు పరిహారాన్ని చెల్లించాలి. ఎప్పుడు పైపులు పగిలి ప్రమాదం జరుగుతుందోనని భయంతో జీవిస్తున్నాం. కాలనీని ఇక్కడి నుంచి తరలించి వేరే చోట సురక్షితమైన ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి' అని అక్బర్?నగర్? వాసి ఖైరున్నీసా విజ్ఞప్తి చేశారు.

# మేథాపాట్కర్ అరెస్ట్

**టీ మీడియా, ఏప్రిల్ 25, న్యూఢిల్లీ :**



సామాజిక కార్యకర్త మేథాపాట్కర్‌ను శుక్రవారం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఢిల్లీ ఎల్‌జిగా ఉన్న వి.కె.సక్సేనా 24ఏళ్ల క్రితం దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఏప్రిల్ 23న సాకేత్ కోర్టు మేధా పాట్కర్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆమెను నేడు కోర్టులో హాజరుపరచనున్నారు. 2000 సంవత్సరంలో వి.కె.సక్సేనా దాఖలు చేసిన పరువునష్టం కేసులో మేథాపాట్కర్‌ను గతేడాది జులైలో దోషిగా నిర్ధారించబడ్డారు. అనంతరం ఆమె ప్రొబేషన్‌పై విడుదలయ్యారు. ఈనెల 8న జరిగిన ఈ కేసు గత విచారణలో మేథాప్కాటర్ బుధవారం (ఏప్రిల్ 23) కోర్టుకు హాజరుకావాలని, ప్రొబేషన్ బాండ్లు, రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. బుధవారం 70 ఏళ్ల మేథాపాట్కర్ కోర్టుకు హాజరుకాలేకపోయారు. దీంతో జడ్జి 'ఢిల్లీ పోలీస్ కమిషనర్ ద్వారా పాట్కర్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తూ' ఆదేశాలు ఇచ్చారు. తదుపరి విచారణ మే 3 నాటికి మేథాపాట్కర్ తమ ఆదేశాలను పాటించాలని జడ్జి స్పష్టం చేశారు.నర్మదా బచావో ఉద్యమం సమయంలో గుజరాజ్‌లో ఒక ఎన్‌జిఓకు సక్సెనా చీఫ్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన పరువునకు నష్టం కలిగించే విధంగా మేథాపాట్కర్ వ్యాఖ్యలు చేశారని సక్సేనా ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు.అయితే హైకోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరుతూ మేథాపాట్కర్ తరపు న్యాయవాది మంగళవారం ఒక దరఖాస్తును దాఖలు చేశారు. కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.



# పార్థివ వాహనాలను తనిఖీ చేసిన రాష్ట్ర ఫ్లీట్ హెడ్ గిరీష్ బాబు

**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**

గద్వాల జిల్లా 108,102,పార్థివ వాహనాలను తెలంగాణ రాష్ట్ర ఫ్లీట్ హెడ్ గిరీష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ తనిఖీలు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, గద్వాల జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య పాల్గొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలు గద్వాల్ హాస్పిటల్ 108 అంబులెన్స్ రికార్డులను, అంబులెన్స్ పరికరాల యొక్క పనితీరును సిబ్బంది యొక్క పనితీరును పరిశీలించడం జరిగింది. అదేవిధంగా 102 అమ్మఒడి వాహనాన్ని కూడా తనిఖీ చేయడం జరిగింది. గర్భిణీలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అదే విధంగా వాహన నిర్వాహనని కూడా సరిగ్గా చేసుకోవాలని వివరించారు. అంబులెన్స్ లను జాగ్రత్తగా నడపాలని ఎల్లపుడూ ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఏంటీలు, పైలట్ లు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలతో ప్రార్థన

**టీ మీడియా, ఏప్రిల్ 25,రామకృష్ణాపూర్:**




క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో కాశ్మీర్ లోని పహల్గాం వద్ద అమాయకులైన టూరిస్టులపై దాడి చేసి 27 మందిని పొట్టన పెట్టుకున్న సంఘటనకి నిరసనగా శుక్రవారం ఆర్కేపి పట్టణ ముస్లిం సోదరులు మేరాజ్ మస్జిద్ నందు సమావేశం కావడం జరిగింది.ముస్లిం మత పెద్దలు అబ్దుల్ అజీజ్,అక్బర్ అలీ, యాకుబ్ అలీ మాట్లాడుతూకాశ్మీర్ లోని పహల్గాం గ్రామం లో జరిగిన సంఘటనకు నిరసనగా మానవతా దృక్పథంతో కుల, మత,రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్క దేశ పౌరుడు మానవత హృదయంతో స్పందించి మరణించిన వారికి,క్షతగ్రతుల కుటుంబాలకు అండగా నిలవాలని భారతదేశంలో శాంతి నెలకొల్పడానికి అందరూ కృషి చేయాలని,ఇస్లాం మతం అనేది హింసని సహించదని శాంతిని నెలకొల్పడమే ముఖ్య ఉద్దేశమని టెర్రరిజాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలకు తగిన బుద్ధి చెప్పాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యు మేరాజ్ మస్జిద్ సదర్ యాకుబ్ అలీ,బిలాల్ మస్జిద్ సదర్ ఆరిఫ్, డాక్టర్.సలీమ్,ఖాజా షరీఫ్, ఖాజా,ఇస్మాయిల్, అజాం, ఖాన్,సమ్రాన్,ఖలీం అన్ని మస్జిద్ ల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బీఆర్ఎస్ నాయకులు

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**

పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.హైదరాబాదులోని ఎమ్మెల్యే మేఘారెడ్డి కార్యాలయంలో ఎమ్మెల్యే వీరికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిరుపేదలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ పాలనపై నమ్మకం ఏర్పడిందని నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీతోనే లబ్ధి చేకూరుతుందని భావించి తాము బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరినట్లు వారు పేర్కొన్నారు.పార్టీలో చేరిన వారిలో కొమ్ము నరసింహ, కె రమేష్, శివకుమార్, వీ మహేష్, కొమ్ము బాలరాజు, వి గోపాల్, కొమ్ము సురేష్, కొమ్ము రాజకుమార్, కొమ్ము ఆంజనేయులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మణిగిల్ల తిరుపతిరెడ్డి, చిన్నమందడి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌పో 2025 ఒసాకాలో గర్వకారణమైన క్షణం

- ఇండియా పావిలియన్‌లో తెలంగాణ అగ్రి-ఎవల్యూషన్ బ్రోచర్ ఆవిష్కరణ

**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**



ఎక్స్‌పో 2025 ఒసాకా సందర్భంగా ఇండియా పావిలియన్‌లో తెలంగాణ అగ్రి-ఎవల్యూషన్ బ్రోచర్ ను అధికారికంగా ఆవిష్కరించడం ఒక గర్వకారణమైన ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నా రెడ్డి, వ్యవసాయ సంస్థ డైరెక్టర్ బంధారి , ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఆవిష్కరణ తెలంగాణ రాష్ట్రం తీసుకుంటున్న ఆధునిక, స్థిరమైన, సాంకేతిక ఆధారిత వ్యవసాయ అభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేయడంలో కీలకమైన అడుగుగా నిలుస్తుంది. ఈ బ్రోచర్ లో సాంకేతికత, సాధికారత పర్యావరణ బాధ్యతతో కూడిన తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధి దృష్టికోణం వివరించబడింది.

# హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీయులు

**టీ మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్:**



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల సీఎంలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు వెంటనే వెళ్లిపోవాలని, పాక్ పౌరులను అనుమతించేది లేదని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.

**పాక్ దేశస్తులను గుర్తించండి..**

రాష్ట్రంలో పాక్ దేశస్తులను వెంటనే గుర్తించి వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ఉన్న పాకిస్థానీయులపై పోలీసులు ఇప్పటికే ఫోకస్ పెట్టారు. అందుకు సంబంధించి వివరాలను కూడా సేకరించారు. తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్ నగరంలో 208మంది పాకిస్థానీయులు ఉన్నట్లుగా తేల్చారు. మరో 48 గంటల్లో పాక్ పౌరులు దేశం విడిచి వెళ్లిపోవాలని సూచించారు.

# ఉద్యమస్ఫూర్తిని రగిలించిన జెండా

- బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టీ మీడియా, ఏప్రిల్ 25, మేడ్చల్:**



ఛలో వరంగల్ బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముస్తాబైంది. ఈ వేడుకల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా జగద్గిరిగుట్ట మగ్దూం నగర్లో పార్టీ జెండా దిమ్మెకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గులాబీ రంగును వేస్తూ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమస్ఫూర్తిని రగిలించిన జెండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన జెండా... అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా తెలంగాణ అభివృద్ధిని గత పదేళ్ల కాలంలో ఉరుకులు పెట్టించినది ఈ జెండా ప్రజాసంక్షేమాన్ని విస్మరించే ప్రభుత్వాలను నిగ్గదీస్తూ తెలంగాణ ప్రజలకు సంక్షేమాన్ని అందించే విధంగా పాలకుల మెడలు వంచేది ఈ జెండా తెలంగాణ ప్రజలకు ఎల్లవేళలా రక్ష ఈ జెండా.... ఇంతటి ఘనచరిత్ర కలిగిన ఈ జెండా, మన జెండాను గులాబీ జెండా రజతోత్సవ వేడుక పండుగకు జగద్గిరిగుట్ట డివిజన్ నుంచి భారీగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి ఛలో వరంగల్ సభను విజయవంతం చేయాలి.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు పాపులు గౌడ్, శశిధర్, అజం, శశిధర్ ముదిరాజ్, ముంతాజ్, రామరాజు,మహేందర్ రెడ్డి, జైహింద్, నర్సింగ్ గౌడ్, రాములు, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక భరోసాతో మహిళల భద్రతకు భరోసా

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**



ఆర్థిక భరోసాతో ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీలను సన్మానించిన ఎస్పీ. వనపర్తి జిల్లాలో పోక్సో అత్యాచార బాధితులకు వైద్య, న్యాయ, సైకాలజికల్ సపోర్ట్ వంటి సేవలు ఒకే గొడుగు కిందకి తీసుకు వచ్చి పోలీసుశాఖలోని ఉమెన్ సేఫ్టీవింగ్ తమ వంతు సేవలు అందిస్తోంది.ఈ భరోసా కేంద్రము బాధితులు ఆర్థికంగా ఎదిగేలా స్వశక్తిపై జీవించేలా సహాయ సహకారాలు అందజేస్తుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం పక్షాన ఫోక్సో , అత్యాచార కేసుల్లో ఉన్న ఎంతోమంది బాధితులకు అన్ని రకాలుగా వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్షణ సహాయం అందిస్తోంది. ఈ నిధి కింద పీజీ చదవడానికి హాస్టల్ ఫీజు కట్టడానికి ఆర్థిక సహాయం చేస్తోంది. పోలీస్ శాఖ అందించే ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని మంచిగా చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థినీలను శుక్రవారం తమ చాంబర్లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో, అత్యాచారం భరోసా కేంద్రం అండగా నిలుస్తుంది అని అలాగే భరోసా సిబ్బంది బాధితుల యొక్క నివాస ప్రాంతాలను సందర్శించి వారి సాంఘిక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను భరోసా బాధిత సహాయ నిధి కింద 5 వేల నుంచి 20 వేల రూపాయల వరకు తక్షణ పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్థిక భరోసాతో ఉన్నత చదువులు చదివి అన్ని రంగాలలో రానించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఎదిగి తమ కాళ్లపై నిలబడగలిగి మహిళ సాధికారతలో భాగం కావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అదనపు ఎస్పి, ఉమా మహేశ్వరరావు, ఏహెచ్ టి యు, ఎస్సై, అంజద్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్, శిరీష, భరోసా సిబ్బంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళులు

**టీ మీడియా, ఏప్రిల్ 25, వనపర్తి బ్యూరో :**




జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన క్రూరమైన తీవ్రవాదుల దాడిలో 28 మంది అమాయక భారతీయులు, ఇద్దరూ విదేశీయులు ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళులు మరణించిన కుటుంబ బాధితులకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వనపర్తి జిల్లా కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు జిటి. శ్యామ్ స్టేట్ సెక్రెటరీ,సి. విశ్వం బాబు వనపర్తి జిల్లా అధ్యక్షులు, గద్వాల ఆంజనేయులు జిల్లా ఉపాధ్యక్షులు.రాత్రి వనపర్తి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నందు జమ్మూ కాశ్మీర్ లోని పహల్గమ్ లో జరిగిన దారుణ ఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి లోను చేస్తుంది, మనసు తీవ్రంగా కలిచివేసింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి బాధిత కుటుంబ సభ్యులకు, మానసిక ధైర్యం తెలుపుతూ మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు నివాళులు అర్పిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బాధిత కుటుంబాలవారిని ఆదుకోవాలని కోరుతూ జమ్ము కాశ్మీర్ లో ఇతర పర్యటక ప్రాంతలలో తీవ్రవాదులు భవిష్యత్తులో ఇటువంటి దుశ్చచర్యలకు పాలు పడకుండా దేశ భద్రతా పట్ల పటిష్ఠ మైన భద్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం అయినది. ఈ కార్యక్రమంలో జిటీ. శ్యామ్ స్టేట్సెక్రటరీ,సి. విశ్వం బాబు వనపర్తి జిల్లా ప్రెసిడెంట్, గద్వాల ఆంజనేయులు వైస్ ప్రెసిడెంట్, జిల్లా జనరల్ సెక్రటరీస్ గొర్ల శైలన్ కుమార్ ఏం. రాజు నాయక్,సెక్రటరీస్విఘ్నేశ్వర చారి,వీరపాగా సత్యం,మందడి శ్రీరామ్,జిల్లా ప్రచార కార్యదర్శిగంధం శివకుమార్ పాల్గొన్నారు.

# కస్తూరి రంగన్ సేవలు చిరస్మరణీయం

వారు పోషించిన పాత్ర దేశం మరిచిపోదని అన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారికి ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు.రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్‌గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా, ఖగోళ శాస్త్రవేత్తగా విశేష సేవలు అందించిన ఒక గొప్ప వ్యక్తిని దేశం కోల్పోయిందని పేర్కొన్నారు. డాక్టర్ కస్తూరి రంగన్ మరణం దేశానికి తీరనిలోటు అని అన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తమ సానుభూతిని తెలియజేశారు.

# ఆ రాష్ట్రాల్లో వర్షాలు, ఇక్కడ వడగాలులు

- దేశంలో వాతావరణంపై ఐఎండీ హెచ్చరికలు

**టి మీడియా, ఏప్రిల్ 25, హైదరాబాద్ బ్యూరో :**



దేశంలో కొన్ని ప్రదేశాల్లో వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో వడగాలులు, ఇంకొన్ని చోట్ల ఉక్కపోత పరిస్థితులు ఉంటాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. వాయువ్య భారతదేశంలో రాబోయే 2-3రోజుల పాటు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. ఏప్రిల్ 29వరకు పశ్చిమ మధ్యప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, తూర్పు రాజస్థాన్?లో వడగాలులు వీస్తాయని స్పష్టం చేసింది. ఛత్తీస్?గఢ్, బంగాల్, సిక్కిం, బిహార్, ఒడిశా, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడ, తెలంగాణలో ఏప్రిల్ 26వరకు వేడి వాతావరణం ఉంటుందని అంచనా వేసింది. ఝూర?ండ్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహే, కోస్తాంధ్ర, యానాం, ఆంధ్రప్రదేశ్ రాయలసీమలో వేడి, తేమతో ఉక్కపోత పరిస్థితులు ఉంటాయని ఐఎండీ పేర్కొంది. ఆదివారం వరకు బంగాల్ లోని కొన్ని చోట్ల, సిక్కింలోని కొన్ని ప్రాంతాల్లో, అసోం, మేఘాలయలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపురలో భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని వెల్లడించింది. రాబోయే 2-3 రోజుల్లో దేశంలోని ఈశాన్య, దక్షిణ ప్రాంతాల్లో మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఏప్రిల్ 25-26 తేదీలలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లో మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**తెలంగాణకు అరెంజ్ అలర్ట్**

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలంగాణలోని హైదరాబాద్?కు ఏప్రిల్ 26వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. రెండు రోజుల పాటు ఉక్కపోతగా ఉంటుందని ఐఎండీ హెచ్చరించింది. ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల సహా పలు జిల్లాల్లో 44డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంది. దిల్లీలోని ఎన్?సీఆర్ ప్రాంతానికి ఎల్లో అలర్ట్ ఇచ్చింది. యూపీ, ఒడిశాలోని పలు ప్రాంతాలకు ఆరెంజ్ ఆలర్ట్?ను జారీ చేసింది.

**దిల్లీలో పెరిగిన ఉష్ణోగ్రతలు**

దిల్లీలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వేడిగాలులు వీచే పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ హెచ్చరించింది. అలాగే ఏక్యూఐ కూడా పేలవంగానే ఉందని పేర్కొంది. ఈ క్రమంలో దిల్లీకి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వారాంతంలో దిల్లీలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఏప్రిల్ 25 ఉదయం 7 గంటలకు దిల్లీలో వాయి నాణ్యత 237గా ఉంది.

# సోనియా, రాహుల్‌గాంధీలకు నోటీసుల జారీకి

- నిరాకరించిన ఢిల్లీ కోర్టు

**టీ మీడియా, ఏప్రిల్ 25, న్యూఢిల్లీ :**



నేషనల్ హెరాల్డ్‌కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్‌గాంధీలకు నోటీసులు జారీ చేసేందుకు ఢిల్లీకోర్టు శుక్రవారం నిరాకరించింది. కొత్త చట్టంలోని నిబంధనల ప్రకారం.. నిందితుల వాదనలు వినకుండా ఫిర్యాదు (చార్జిషీట్‌కు సమానమైన ఈడి )ని పరిగణనలోకి తీసుకోలేమని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగే పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలకు నోటీసులివ్వాలంటూ ఈడి దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. అటువంటి ఉత్తర్వులు జారీ చేయలేమని అన్నారు. చార్జిషీట్లో కొన్ని పత్రాలు లేవని, ఆ పత్రాలను దాఖలు చేయాలని ఈడిని ఆదేశించారు. ఆ తర్వాత నోటీసులు జారీ చేసే అంశాన్ని నిర్ణయిస్తామని పేర్కొన్నారు. తదుపరి విచారణను మే 2వ తేదీకి వాయిదా వేశారు

# ఉగ్రదాడి మృతులకు నివాళి

**టీ మీడియా, ఏప్రిల్ 25,ఏప్రిల్ 25 ,ఆత్మకూరు :**




జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిలో అమరులైన వారికి నివాళిగా ఆత్మకూరు మండల కేంద్రం లో నివాళులు అర్పించిన ముస్లిం నాయకులు యువకులుజమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనను పిరికిపంద చర్యగా అభివర్ణించారు, ఇటువంటి కిరాతక చర్యలు భారత ప్రజల సమైక్యతను, ధైర్యాన్ని ఎన్నటికీ దెబ్బతీయలేవు అని స్పష్టం చేశారు.ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలుపుతూ మౌనం పాటించారు ఆత్మకూరు మండల కేంద్రలో ని గాంధీ చౌక్ దగ్గర నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2025




వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ సందర్శకులకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించనుంది.ఈ అత్యంత ముఖ్యమైన సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. అంతేకాకుండా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)కి చెందిన అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ వంటి ప్రముఖులు కూడా ఈ సదస్సులో పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను పంచుకోనున్నారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో న్యాయం, శాంతిని నెలకొల్పడం, అహింసా మార్గాన్ని ప్రోత్సహించడం ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశాలు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల ప్రతినిధులు పెట్టుబడుల అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాలు, శాంతి స్థాపన వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరపనున్నారు. ఈ సమ్మిట్ ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాముఖ్యతను మరింతగా చాటిచెబుతుందని భావిస్తున్నారు.